## వైద్యం వికటించి బాలుడు మృతి

**మనూర్, సెప్టెంబరు 20, ప్రభాతవార్త:**
ఆర్ఎంపి డాక్టర్‌చేసిన వైద్యంవికటించి బాలుడు మృతిచెందిన సంఘటన మండలపరిధిలోని షెల్గిరాలో చోటుచేసుకుంది. ఇందుకుసంబంధించి ఎస్ఐ కోటేశ్వరరావు కథనంప్రకారం, గ్రామానికిచెందిన బేకరీ లక్ష్మణ్ రెండవకుమారుడు బేకరీ ప్రశాంత్ (14)కు ఈనెల17న దగ్గు,జ్వరంరావడంతో గ్రామంలోని ఆర్ఎంపి డాక్టర్ యునుస్‌వద్దకు వెళ్లి వైద్యం అందుకున్నారన్నారు. వైద్యంలోభాగంగా యునుస్ బాలుడికి వైద్యంచేసి బాలుడిని ఇంటికిపంపాడన్నారు. బాలుడు ప్రశాంత్‌కు జ్వరం తగ్గకపోవడంతో ఈనెల 18న మరోమారు డాక్టర్‌వద్దకు తీసుకుపోగా సెలైన్‌పెట్టి ఇంటికి పంపించాడన్నారు. వైద్యం వికటించడంతో ఈనెల 19న తిరిగి బాలుడిని డాక్టర్‌వద్దకు తీసుకెళ్లగా ఇన్‌ఫెక్షన్ అయింది, వేరే ఆసుపత్రికి తీసుకుపోమనడంతో బాలుడిని కర్ణాటకలో బీదర్ ఆసుపత్రికితరలిస్తున్నక్రమంలో దారిలో చనిపోయాడన్నారు. డాక్టర్ నిర్లక్ష్యంవలనే తనకుమారుడు చనిపోయాడని, డాక్టర్‌పై కఠినచర్యలు తీసుకోవాలని తండ్రి ఫిర్యాదుచేశాడన్నారు. శవానికి నారాయణఖేడ్ ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం జరిపి, కుటుంబసభ్యులకు అప్పగించి కేసు నమోదుచేసుకుని దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

# మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట వార్త

## సెంట్రల్ జైలును తనిఖీ చేసిన జిల్లా న్యాయమూర్తి

**కంది, సెప్టెంబరు 20, ప్రభాతవార్త:**
జాతీయ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ సూచనల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.భవానిచంద్ర శనివారం మండల కేంద్రమైన కందిలోని జిల్లా సెంట్రల్ జైలును తనిఖీ చేశారు. జైలులో ఉన్న బేరక్‌లను, గదులను, వంట గదిని, మూత్రశాలలు, మరుగుదొడ్లను, జైలు పరిసరాలను న్యాయమూర్తి భవానిచంద్ర పరిశీలించారు. ఖైదీలకు అందుతున్న భోజనం రుచిని న్యాయమూర్తి ఆస్వాదించారు. ఖైదీలు అందుతున్న సౌకర్యాలను న్యాయమూర్తి అడిగి తెలుసుకున్నారు. ఖైదీలకు అందాల్సిన సౌకర్యాలు సజావుగా అందేలా చూడాలని జైలు బాధ్యులను ఆదేశించారు. జైలులోని లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను సైతం న్యాయమూర్తి పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి బి.సౌజన్య, జైలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బైరాన్‌పల్లిని వీరబైరాన్‌పల్లిగా మార్చాలని సిఎంకు ఎంపి వినతి



సిఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందిస్తున్న ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

**ధూళిమిట్ట, సెప్టెంబరు 20, ప్రభాతవార్త:**
బైరాన్‌పల్లిని వీరబైరాన్‌పల్లిగా మార్చాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రాన్ని అందించారు. శనివారం హైద్రాబాద్‌లో సిఎంను కలిసి ఈ ప్రాంతం చారిత్రాత్మక సంఘటనను వివరించి, ప్రాంతప్రజల కోరిక మేరకు రాబోయే తరాలకు గుర్తుండేలా గ్రామం పేరును వీరబైరాన్‌పల్లిగా ఆధికారికంగా ప్రకటించాలని ఆయన కోరినట్లు సమాచారం.

## మంత్రి పొన్నంకు ఆహ్వాన పత్రిక



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆహ్వానపత్రిక అందజేస్తున్న దృశ్యం

**వర్గల్, సెప్టెంబరు 20, ప్రభాతవార్త:**
ప్రసిద్ధ వర్గల్ శ్రీవిద్యా సరస్వతి అమ్మవారి దేవాలయంలో ఈనెల 22వ తేదీ నుండి ప్రారంభం కానున్న శరన్నవరాత్ర మహోత్సవాల ఆహ్వానపత్రికను ఆలయ కమిటీ సభ్యులు శనివారం రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రిని అమ్మవారి శేషవస్త్రంతో సత్కరించి ప్రసాదాలు అందజేశారు. కాగా ఈనెల 29వ తేదీ మూలానక్షత్ర విశేష పూజలో పాల్గొననున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

## సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



వ్యవసాయశాఖ మంత్రి నాగేశ్వర్‌రావును సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**
ప్రజాపాలనలో భాగంగా కాంగ్రెస్ సర్కార్ నిరుపేదల కోసం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను, అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు సూచించినట్లు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ, సిద్దిపేట పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎం.డి.ఇమామ్(అత్తు)లు తెలిపారు. నంగునూర్ మండల పరిధిలోని నర్మెటలో నిర్మించిన ఆయిల్‌పాం కర్మాగారాన్ని సందర్శించడానికి వెళ్తున్న మంత్రి నాగేశ్వర్‌రావును మర్యాదపూర్వకంగా కలిసి సిద్దిపేటలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించడమే లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారని తెలిపారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా సర్కార్ ముందుకు సాగుతుందని తెలిపినట్లు వారు వివరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తప్పెట శంకర్, పూజల గోపికృష్ణ, బొమ్మల యాదగిరి, గయాజుద్దీన్, వహాబ్, అజ్మత్, మైపాల్‌రెడ్డి, ఎర్ర మహేందర్, చెంది శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## మంత్రి కొండా సురేఖకు వినతిపత్రం



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న నాచగిరి ఆలయ చైర్మన్, కార్యనిర్వహణాధికారి

**వర్గల్, సెప్టెంబరు 20, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని నాచగిరి శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవాలయ చైర్మన్ రవీందర్‌గుప్తా, ఆలయ కార్యనిర్వహణాధికారి విజయరామారావులు శనివారం రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయశాఖ మంత్రి కొండా సురేఖను హైద్రాబాద్‌లోని వారి కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాచగిరి దేవస్థానం మాస్టర్‌ప్లాన్ పునరుద్ధరణకై ఆమోదం నిమిత్తం, భక్తుల సౌకర్యార్థం అభివృద్ధి పనులు చేపట్టటానికి నిధుల మంజూరుకై కలిసినట్లు తెలిపారు. ఈవిషయంలో మంత్రి సానుకూలంగా స్పందించి త్వరలో బృహత్ ప్రణాళిక అమలు, అభివృద్ధి పనులకై నిధులు సమకూర్చుటానికి హామీ ఇచ్చినట్లు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో ఆలయ ధర్మకర్తలు చందా నాగరాజు, గాలి కిష్టయ్య, కొత్తపల్లి శ్రీనివాస్, రుద్ర శ్రీహరి, తిరుమలరావు, సిబ్బంది సుధాకర్ తదితరులు ఉన్నారు.

## పామాయిల్ ఉత్పత్తిలో రాష్ట్రంలో సిద్దిపేట నంబర్‌వన్‌గా ఉండాలి

### -త్వరలోనే సిఎం చేతులమీదుగా ఫ్యాక్టరీ ప్రారంభం
### -మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

**నంగునూర్, సెప్టెంబరు 20, ప్రభాతవార్త:**
ఆయిల్‌పాం పంట సాగులో సిద్దిపేట జిల్లా తెలంగాణ రాష్ట్రంలోనే నంబరు వన్‌గా ఉండాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. శనివారం మండల పరిధిలోని నర్మెట గ్రామంలో 300 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న పామాయిల్ ఫ్యాక్టరీ పనులను ఆయన సందర్శించారు. ఈసందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతులు మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలను సాగు చేయాలన్నారు. పామాయిల్ తోటలతో రైతులకు అధిక ఆదాయం వస్తుందని రైతులు పామాయిల్ తోటలను సాగు చేయడానికి ముందుకు రావాలన్నారు. పామాయిల్ తోటలో అంతరపంటగా కోకో జాజి మెకాడమీ లాంటి పంటలు కూడా వేసుకోవచ్చునని తెలిపారు. ఫ్యాక్టరీలో ప్రాసెసింగ్‌తో పాటు వంట చేసుకునే విధంగా ఆయిల్ తయారయ్యే విధానం కూడా ఇక్కడ చేయడం జరుగుతుందన్నారు. దేశంలోనే మొదటిసారి ఆధునాతన టెక్నాలజీతో నర్మెట గ్రామంలో ఆయిల్‌పాం ఫ్యాక్టరీ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. భవిష్యత్‌లో నర్మెట ఫ్యాక్టరీలో ఆయిల్‌పాంకు నిర్ణయించిన ధర అంతటా వర్తింప చేసేలా ఇక్కడ అభివృద్ధి జరుగుతుందన్నారు. ఖమ్మం ఫ్యాక్టరీలో సైతం రిఫండ్ ఆయిల్‌చేసే విధానంలేదన్నారు. నర్మెటలో నిర్మిస్తున్న ఫ్యాక్టరీలో రిఫండ్ ఆయిల్ తయారు చేసే ఆధునిక టెక్నాలజీ ఉందని అన్నారు. తాను మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన తరువాత మొదటి సంతకం ఆయిల్‌పాం పనుల కోసం పెట్టడం జరిగిందన్నారు. ఫ్యాక్టరీ పనులు పూర్తి కాగానే అధికారులు సమాచారమిస్తే లక్షమందితో మీటింగ్ ఏర్పాటుచేసి సిఎం చేతులమీదుగా ఫ్యాక్టరీని ప్రారంభం చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కె.హైమావతి, అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్, రాష్ట్ర ఆయిల్‌ఫెడ్‌చైర్మన్ రాఘవరెడ్డితోపాటు అధికారులు ఉన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

## కిష్టారెడ్డిపేటలో డ్రైనేజ్ సమస్యలు



కిష్టారెడ్డిపేట దుర్గానగర్‌లో పొంగిపొర్లుతున్న డ్రైనేజ్

**అమీన్‌పూర్, సెప్టెంబరు 20, ప్రభాతవార్త:**
మున్సిపల్ పారిశుధ్య అధికారులు, సిబ్బంది కాలనీలలో దృష్టి సారించకపోవడంతో డ్రైనేజ్ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలంలోని కిష్టా రెడ్డిపేట దుర్గానగర్ కాలనీలో డ్రైనేజ్ సమస్యలు తీవ్రంగా కనిపిస్తున్నాయి. డ్రైనేజ్ నిండడం కారణంగా మురుగునీరు వీధుల్లోకి పొంగి పొర్లుతోంది. దీనివల్ల కాలనీవాసులు ప్రతిరోజూ దుర్వాసనతో, చెదురుమదురు చెత్తతో ఇబ్బందులు పడుతున్నారు. దీనివల్ల చిన్నపిల్లలు, వృద్ధులు దోమల కారణంగా ఆరోగ్య సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది. పలుమార్లు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదుచేసినా ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలంటే వెంటనే డ్రైనేజ్ లైన్లు శుభ్రపరిచి శాశ్వత పరిష్కారం చూపాలి అని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## మహిళ మృతికి కారణమైన నిందితుని రిమాండ్



నిందితుని వివరాలు తెలుపుతున్న సిఐ మహేందర్‌రెడ్డి

**మర్కుక్, సెప్టెంబరు 20, ప్రభాతవార్త:**
మహిళ మృతికి కారణమైన నిందితున్ని రిమాండ్‌కు తరలించినట్లు గజ్వేల్ రూరల్ సిఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. శనివారం మర్కుక్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని పాములపర్తి గ్రామానికి చెందిన అయ్యనోళ్ల భూపాల్ అనే వ్యక్తి కొన్ని రోజుల క్రితం అదేగ్రామానికి చెందిన కొండి ఎల్లమ్మ అనే మహిళను నెట్టి వేయడంతో ఆమె కడుపులో బలమైనగాయమై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ రెండురోజుల క్రితం మరణించిందని తెలిపారు. మహిళ మృతికి కారణమైన అయ్యనోళ్ళ భూపాల్‌పై కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎస్ఐ దామోదర్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## జిల్లా స్థాయి కబడ్డీ శిక్షణ శిబిరం

**మర్కుక్, సెప్టెంబరు 20, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని ఎర్రవల్లిలో శనివారం సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కబడ్డీ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌సి.సంతోష్‌గుప్త, ప్రధాన కార్యదర్శి శివకుమార్, కోశాధికారి కుంట సత్యంలు మాట్లాడుతూ ఈనెల 25 నుండి 28వరకు నిజామాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు సిద్దిపేట జిల్లా కబడ్డీ క్రీడాకారులకు ఈనెల 24వరకు ఎర్రవల్లి ఫంక్షన్ హాల్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కబడ్డీ క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని రాష్ట్రస్థాయి పోటీల్లోపాల్గొని జాతీయ స్థాయిలో రాణించాలని పిలుపునిచ్చారు. శిక్షణ శిబిరానికి వచ్చే క్రీడాకారులకు భోజనవసతి కూడా కల్పిస్తు న్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక మాజీ సర్పంచ్ భాగ్య బిక్షపతి, మాజీ ఎంపిటిసి ధనలక్ష్మి కృష్ణ, పిఏసిఎస్ వైస్ చైర్మన్ బాలరాజు, నాయకులు కృష్ణారెడ్డి, రాం మోహన్‌రెడ్డి, చింతకాయల స్వామి, కనకయ్య, గీసు మల్లేశం, పర్శరాములు, శ్రీశైలం, నవీన్, బాల్‌చంద్రం, మహేష్, యాదగిరి, బాలకృష్ణ, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



జిల్లా స్థాయి కబడ్డీ శిక్షణ శిబిరంను ప్రారంభిస్తున్న విడిసి సభ్యులు

## ఖననం చేసిన మహిళ శవం వెలికితీత



జెసిబితో శవాన్ని వెలికి తీస్తున్న దృశ్యం

**మునిపల్లి, సెప్టెంబరు 20, ప్రభాతవార్త:**
గతసంవత్సరం హత్యకుగురైన మహిళశవాన్ని పోలీసులు వెలికితీశారు. మండల కేంద్రమైన మునిపల్లికి చెందిన అనసూయ గత సంవత్సరం మే 18న ఏడుపాయలలో హత్యకు గురైంది. గ్రామానికి చెందిన బస్వరాజ్‌తో గల వివాహేతర సంబంధం ఈ హత్యకు కారణమైంది. కాగా విచారణలో భాగంగా ఆమె డిఎన్ఎ తన కమారుడి డిఎన్ఎతో సరిపోకపోవడంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో శనివారం సదాశివపేట సిఐ వెంకటేశం, ఎస్సై రాజేష్‌నాయక్ సంగారెడ్డి వైద్య కళాశాల వైద్యుడు రాము ఆధ్వర్యంలో పోలీసులు శవాన్ని వెలికితీసి ఆమె డిఎన్ఎను సేకరించారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**రామాయంపేట మున్సిపాలిటీ, సెప్టెంబరు 20, ప్రభాతవార్త:**
రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, చికిత్సపొందుతూ ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలోని మెదక్ రోడ్డులో చోటుచేసుకుంది. ఫిర్యాదుదారుడు అగుపిట్టల బిక్షపతి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చేగుంట మండలంలోని బోనాలతండాకు చెందిన అగుపిట్టల గుడ్డు(46), రామాయంపేట నుండి అక్కన్నపేటకు తిరిగి వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయాలపాలై, చికిత్సపొందుతూ మరణించాడు, మృతుడైన గుడ్డు తన తమ్ముడు కాగా, వృత్తిరీత్యా కూలీపనులు చేసేవాడు. తేదీ 15.09.2025న మధ్యాహ్నం 3:00 గంటల సమయంలో టివిఎస్ ఎక్సెల్ (నంబర్ ఎపి 25 ఎఎఫ్ 6309) ద్విచక్రవాహనంపై రామాయంపేటకు వెళ్లాడు. అదేరోజు రాత్రి 8:00 గంటల సమయంలో తిరిగి అక్కన్నపేటకు తన నివాసానికి వస్తుండగా, మెదక్ బ్రిడ్జి దాటిన తర్వాత కొంత దూరంలో అతని వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో గుడ్డు కుడిచేయి, కుడివైపు తలభాగం, కుడి మోచేతి భాగాలకు తీవ్రంగా గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న బంధువులు వెంటనే అక్కడికి చేరుకుని గాయపడిన గుడ్డును రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రికి తీసుకెళ్లగా, చికిత్స పొందుతూ తేదీ 19.09.2025 రాత్రి 11:20 గంటలకు మృతిచెందాడు. ఈ ఘటనపై రామాయంపేట పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## వరుస దొంగతనాలకు పాల్పడిన దొంగల అరెస్ట్

### -దొంగలను జైలుకు తరలించిన పోలీసులు
### -నర్సాపూర్ పోలీసుల ఆపరేషన్ విజయవంతం
### -దొంగలగుట్టు రట్టుచేసిన నర్సాపూర్ పోలీసులు



దొంగలను అరెస్ట్‌చేసిన అనంతరం మాట్లాడుతున్న ఎస్ఐ బి.లింగం తదితరులు

**నర్సాపూర్, సెప్టెంబరు 20, ప్రభాతవార్త:**
డివిజన్ కేంద్రమైన నర్సాపూర్ పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లో వరుసగా దొంగతనాలకు పాల్పడుతున్న దొంగలను నర్సాపూర్ పోలీసులు ఎస్సై బి.లింగం ఆధ్వర్యంలో ఆపరేషన్ నిర్వహించి దొంగలగుట్టు రట్టుచేసి ఆపరేషన్ విజయవంతంగా ముగించారు. వరుసదొంగతనాలను ఛేదించి నిందితులను అరెస్టుచేసి, జైలుకు తరలించారు. ఈ సందర్భంగా నర్సాపూర్ ఎస్సై బి.లింగం విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 20 తేదీ శనివారం ఉదయం 6గంటల సమయంలో నర్సాపూర్ చౌరస్తాలో పోలీసుల ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలను నిర్వహించారు. ఈ తనిఖీలో ఒక స్కూటీపై ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా వెనక్కి తిరిగి పారిపోవడానికి యత్నించారని తెలిపారు. వెంటనే పోలీసులు వెంబడించి వారిని అదుపులోకి తీసుకొని విచారణ చేయగా నిందితులు తమ పేర్లను వెల్లడించారని తెలిపారు. ఈ మేరకు నిందితులు నర్సాపూర్ మండలం ఎర్రగుంట తండాకు చెందిన మూడవత్ అంజ్య (28), నెల్లూరు జిల్లా వాసి హైదరాబాద్‌లో నివసిస్తున్న చిల్లకూరి కృష్ణారెడ్డి(42), టేక్మాల్ మండలానికి చెందిన నెమలి శ్రీనివాస్(40)లుగా తమ పేర్లు వెల్లడించారని తెలిపారు. ఈ ముగ్గురు గతంలో పలు దొంగతనాల కేసుల్లో జైల్లో పరిచయం ఏర్పరచుకొని విడుదలైన అనంతరం ముగ్గురు కలిసి గుంపుగా ఏర్పడి దొంగతనాలకు పాల్పడుతున్నామని వారు ఒప్పుకున్నట్లు తెలిపారు. ఇటీవల నర్సాపూర్ సంగారెడ్డి ప్రాంతాల్లో పలు దుకాణాలలో చోరీలు చేసినట్లు అలాగే నర్సాపూర్‌లో మార్కెట్ రోడ్‌లో గల బంగారు, వెండి ఆభరణాల దుకాణం, ప్రింటర్ షాప్ దుకాణాల్లో చొరబడి 20 తులాల వెండి బిళ్ళలు, రూ.2000 నగదు, ఇతర వస్తువులు దొంగిలిచ్చినట్లుగా వారు ఒప్పుకున్నారని అన్నారు. అలాగే సంగారెడ్డిలో పలు దుకాణాల్లోకి చోరీలకు పాల్పడినట్లు వెల్లడించారు. ఈ మేరకు ఈ ముగ్గురి నిందితుల వద్ద నుండి ఒక టివిఎస్ జూపిటర్ స్కూటీ, సుమారు 20 తులాల వెండి, 2000 నగదు, ఇనుపరాడ్లు స్క్రూడ్రైవర్, శానం, సెల్ ఫోన్‌ల వంటి పరికరాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కాగా ఇటీవల నారాయణపూర్‌లో వరుసగా 6 ఇళ్లలో చోరీ చేసిన వ్యక్తి కొల్చారం మండలం నాయిని జలాల్పూర్ గ్రామానికి చెందిన దుబ్బగళ్ళ నీరుడు కృష్ణను సైతం అరెస్టు చేసి అతడి వద్ద నుండి పూర్తిగా రికవరీ చేశామన్నారు. ఈ నిందితులపై సంబంధిత సెక్షన్ల కిందకేసులు నమోదు చేసి కోర్టుకు హాజరుపరచనున్నట్లు ఎస్సై బి.లింగం తెలిపారు. ఈ మేరకు ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులను గాని, వాహనాలను గాని గమనించినట్లయితే పోలీసులకు సమాచారం అందించినట్లయితే ప్రజల సహకారంతో నేరాలను అరికట్టగలమని ఆయన తెలిపారు.

## ట్రిబుల్ ఆర్ అలైన్మెంట్‌ను వెనక్కి తీసుకోవాలి

**కొండాపూర్, సెప్టెంబరు 20, ప్రభాతవార్త:**
రీజినల్ రింగ్ రోడ్ అలైన్మెంట్‌ను వెంటనే వెనక్కి తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అతిమేల మానిక్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని స్థానిక సిపిఎంపార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రియల్ ఎస్టేట్ వెంచర్లు బడాబాబుల ప్రయోజనాల కోసమే ట్రిబుల్ ఆర్ రోడ్డు అలైన్మెంట్ మార్చడం దారుణమని అన్నారు, రైతుల నుండి బలవంతంగా భూసేకరణ చేస్తే రైతులకు అండగా సిపిఎంపార్టీ పోరాడుతుందని అన్నారు. మండలంలోని వివిధ గ్రామాలు మరేపల్లి, రాంపూర్‌తండా, గోటిలగుంట, మాచపల్లి, గంగారం, శివన్నగూడెం, అలియాబాద్, తొగరపల్లి, గిర్మాపూర్‌ల నుండి రీజనల్ రింగ్ రోడ్ కోసం రైతుల నుండి బలవంతంగా భూసేకరణ చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుందని అన్నారు. సమావేశంలో మండల కార్యవర్గ సభ్యుడు కె.రాజయ్య, మండల కమిటీ సభ్యులు బాబురావు, ప్రవీణ్, నాయకులు నర్సింలు, అర్జున్, ఆనందం, సంపత్, తదితరులు పాల్గొన్నారు.

## వ్యాపారులకు అండగా ఉంటా : ఎమ్మెల్యే



**అత్తాపూర్ సెప్టెంబరు20,ప్రభాతవార్త :**
వ్యాపారులు ఎవ్వరూ అధైర్య పడ్డోదని అన్ని విధాలుగా అండగా ఉంటాని ధైర్యంగా ఉండాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు. అరాంఘర్ చౌరస్తాలో వ్యాపారుల విజ్ఞప్తి మేరకు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ శనివారం పర్యటించారు. వ్యాపారులు చాలాకాలంగా అక్కడ వ్యాపారాలు నిర్వహించుకుంటున్నారు. ఇటీవల కాలంలో అధికారులు ట్రాఫిక్ పోలీసులు వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నట్టు ఎమ్మెల్యేకు మొరపెట్టుకున్నారు. చిరు వ్యాపారులను ఇబ్బందులకు గురి చేయొద్దని ఈ సందర్భంగా ఎమ్మెల్యే అధికారులకు ట్రాఫిక్ పోలీసులకు సూచించారు. అయితే వ్యాపారులు కూడా ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఫుట్ పాతుల ఆక్రమించకుండా వెనుక వైపు వ్యాపారాలు నిర్వహించుకోవాలని వారికి సూచించారు. పోలీసులు అధికారులు చేసే సూచనలు పాటించాలని వారికి ఇబ్బందులు కలిగేలా పనులు చేయొద్దని ఎమ్మెల్యే వారికి చెప్పారు. కార్యక్రమంలో డిసి సురేందర్‌రెడ్డి, ట్రాఫిక్ సిఐ రాజు,పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రత పట్ల శ్రద్ధ వహించాలి



**అత్తాపూర్ సెప్టెంబరు20 ,ప్రభాతవార్త :**
పరిసరాల పరిశుభ్రత పట్ల ప్రతి ఒక్కరు శ్రద్ధ వహించాలని సేవా పక్వాడ్ రాజేంద్రనగర్ డివిజన్ కన్వీనర్ బండారి బాలకృష్ణ పేర్కొన్నారు.ప్రధాని నరేంద్ర మోడీ జన్మదినాన్ని పురస్కరించుకొని 15 రోజుల సేవా కార్యక్రమాలలో భాగంగా శనివారం రాజేంద్రనగర్ డివిజన్ రాజేంద్రనగర్ నవ జ్యోతి యూత్ క్లబ్ ఆవరణలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం సేవా పక్వాడ్ డివిజన్ కన్వీనర్ బండారి బాలకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించి యూత్ క్లబ్ పరిసరాలు శుభ్రం చేశారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని రోగాల బారిన పడకుండా ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని సూచించారు. నరేంద్ర మోడీ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో పాటు కార్యకర్తలందరూ సేవా కార్యక్రమాలలో నిమగ్నం కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు సందీప్ ముదిరాజ్, రంగారెడ్డి జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి వై శ్రీధర్ డివిజన్ మాజీ అధ్యక్షులు జి బాబురావు ఎస్ వాసు హరికిషన్ జి వనితా రెడ్డి రవీందర్ ఎస్ రాజశేఖర్ రెడ్డి గి.పవన్ మల్లేష్ చారి సరిత రెడ్డి పద్మావతి స్వామి రవి పుస్తకాల వంశీ సతీష్ పాల్గొన్నారు.

## జోవియల్ స్కూల్‌లో బతుకమ్మ సంబరాలు



జోవియల్ స్కూల్లో బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న ఉపాధ్యాయుల విద్యార్థులు

**యాచారం, సెప్టెంబర్ 20, ప్రభాతవార్త**
యాచారం మండల కేంద్రములోని జోవియల్ స్కూల్ బతుకమ్మ సంబరాలు శనివారం ఘనంగా నిర్వహించారు. జోవియల్ స్కూల్ లో విద్యార్థి విద్యార్థినిలతో బతుకమ్మ సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.ప్రిన్సిపాల్ రేఖ శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. బతుకమ్మ సంబరాలు మన పూర్వ సాంస్కృతి సాంప్రదాయాలకు ప్రతిరూపంగా భావించి కొలుస్తున్నమని పేర్కొన్నారు.మన దేశంలో ప్రకృతిని దైవంగా పూజించి ఆరాధిస్తామని ప్రేమ అనురాగాలు ఆత్మీయతతో ప్రజలంతా ఉంటారని సంస్కృతికి నిదర్శనం అన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ వద్ద ధర్నా

**యాచారం,సెప్టెంబర్20, ప్రభాతవార్త**
పెన్షన్లు పెంచాలి, కొత్త పెన్షన్లు మంజూరు వెంటనే చేయాలని ప్రభుత్వం పై,ఎం ఆర్ పి ఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ ఆదేశాల తో తలపెట్టిన గ్రామపంచాయతీల ముట్టడి, ధర్నా కార్యక్రమాన్ని యాచారం లో ఎం ఆర్ పి ఎస్ నాయకులు శనివారం విజయవంతం చేశారు. యాచారం ఎం ఆర్ పి ఎస్ మండల అధ్యక్షుడు మూలి మహేష్ ఆధ్వర్యంలో యాచారం గ్రామపంచాయతీ కార్యాలయాన్ని వికలాంగులు, ఒంటరి మహిళలు, వృద్ధులతో కలిసి ముట్టడించి, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శికి వినతి పత్రం అందించి, మాట్లాడుతూ... వికలాంగులకు 6000 పెన్షన్ పెంచాలని, ఒంటరి మహిళ, వితంతువు,చేనేత కార్మికులకు 4000 పెన్షన్ పెంచాలని డిమాండ్ చేశారు. పెన్షన్లపై ప్రభుత్వం వెంటనే చర్య తీసుకోవాలని, లేకుంటే, గ్రామ పంచాయతీ నుంచి, జిల్లా, రాష్ట్ర స్థాయి లో ఆందోళన చేస్తామని, పెద్ద ఎత్తున సచివాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వి హెచ్ పి ఎస్ సీనియర్ నాయకుడు సాయి,పార చెంద్రయ్య, మస్కు లక్ష్మమ్మ, ముదిరెడ్డి నరసింహ, మస్కు యాదయ్య,జోగు పాండరి, చందూరి యాదయ్య,మంత్రి ఎల్లయ్య,జోగు యాదయ్య,పాల్గొన్నారు.

## సహకార సంఘంలో నిలిచిన సేవలు



**యాచారం,సెప్టెంబర్ 20, ప్రభాతవార్త...**
యాచారం మండల కేంద్రంలో ఉన్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ పదవి కాలం ముగియడంతో పదవి కాలం కొనసాగింపు చేశారు. గత పది రోజులు క్రితం కొనసాగిస్తున్న చైర్మన్ పదవిని తొలగించినట్లు సమాచారం. నూతన సహకార సంఘం చైర్మన్ కోసం అధికార పార్టీ డైరెక్టర్‌ను నూతన చైర్మన్గా ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ఆధ్వర్యంలో నియమించినట్లు తెలుస్తోంది. చైర్మన్ సిఇ జాయింట్ చెక్కుల ద్వారా సేవలు ఉండేవి నేడు చైర్మన్ తొలగించడంతో సేవలకు అంతర్యం కలుగుతుందని పలువురు పేర్కొంటున్నారు. వెంటనే నూతన చైర్మన్ ను నియమించి అంతరాయాన్ని తొలగించాలని రైతులకు తక్షణ సేవలు అందించాలని కోరుతున్నారు.

## ప్రజలను వంచించటానికే ఫ్యూచర్‌సిటీ : సాయిబాబా

**ముషీరాబాద్, సెప్టెంబర్ 20, ప్రభాతవార్త:** ప్రజలను వంచించటానికే ఫ్యూచర్ సిటీ అంటూ కాంగ్రెస్ ప్రభుత్వం మరో కొత్త నాటకానికి తెరలేపిందని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా ఆరోపించారు. శనివారం లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చినుకుపడితే నగరం అతలాకుతలమై, సామాన్య ప్రజలు అరచేతుల్లో ప్రాణాలు పెట్టుకుని బతుకుతూ ఉంటే పట్టించుకోలేని ప్రభుత్వం ఫ్యూచర్ సిటీ అంటూ ప్రజల ను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు.

## 22 నుంచి మహంకాళి ఆలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు

### -భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా పటిష్ట చర్యలు : ఈఓ గుత్తా మనోహర్‌రెడ్డి



విలేఖరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఈ ఓ ,ఫౌండర్ ఫ్యామిలీమెంబర్లు.

**బేగంపేట సెప్టెంబరు 20,ప్రభాతవార్త**
సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారి దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఈ నెల 22 నుంచి ప్రారంభ మవుతాయని,ఉత్సవాలను ఎంతో వైభవంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని రకాలైన ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని ఈ ఓ గుత్తా మనోహర్ రెడ్డి తెలియజేసారు.శనివారం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఈ ఓ.ఫౌండర్ ఫ్యామిలీమెంబర్‌తో కల్సి సమావేశంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఈ ఓ మాట్లాడుతూ ఈ నెల 22వ తేదీ నుంచి అక్టోబరు 2వతేది వరకు ఉత్సవాలు జరుగుతాయని ఈ తెలిపారు.ప్రతి రోజు అమ్మ వారు ఒక్కో అలంకారంలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారని ఆయన తెలియజేసారు.ప్రతి రోజు ఉదయం గం 9.30లకు అలంకారం దర్శనం ఉంటుందని చెప్పారు. 22న బాలత్రిపుర సుందరీదేవి,23న గాయత్రీదేవి,24వతేదీ రాజరాజేశ్వరీదేవి,25వతేదీన అన్నపూర్ణాదేవి,26న గజలక్ష్మి దేవి,27వతేదీ భవానీదేవి,28న తేదీన చండీదేవి అలంకారం, 29న సరస్వతీదేవి,30న దుర్గాదేవి,అక్టోబరు 1న మహిషాసుర మర్దినీదేవి,2న మహాకాళీదేవి అలంకారం దర్శనం ఇవ్వనున్నట్లు తెలియజేసారు.ప్రతి రోజు అభిషేకాలు, కుంకుమార్చన,చండీహోమం తదితర పూజలు జరుగుతాయన్నారు. 30వ తేదన దేవాలయ ప్రాంతంలో సద్దుల బతుకమ్మ ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు.ప్రతి రోజు సాయంత్రం గం 6ల నుంచి దేవాలయం ప్రాంగణంలో ఆధ్యాత్మిక.ధార్మిక,సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు.

## బిసి రిజర్వేషన్లే లక్ష్యంగా 24న బిసి బతుకమ్మ : జాజుల శ్రీనివాస్‌గౌడ్



బిసి బతుకమ్మ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జాజులశ్రీనివాస్‌గౌడ్, మణిమంజరి, తారకేశ్వరి, సంధ్య, శ్యామల, గౌతమి, వరలక్ష్మి తదితర నాయకురాల్లు

**రవీంద్రభారతి, సెప్టెంబరు 20 ప్రభాతవార్త :** రాష్ట్రంలో బిసిలకు 42శాతం రిజర్వేషన్లు పెంచాలని, అలాగే మహిళా బిల్లులో బిసి మహిళలకు సబ్‌కోటా కల్పించాలన్న ప్రధాన డిమాండ్లతో ఈనెల 24న హైదరాబాద్‌లోని సచివాలయం వద్ద వేలాదిమంది మహిళలతో పెద్దయెత్తున బిసి బతుకమ్మను నిర్వహిస్తున్నట్లు బిసి సంక్షేమ సంఘం జాతీయాధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఈమేరకు రవీంద్ర భారతిలో బిసి మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు బి.మణి మంజరి ఆధ్వర్యంలో 24న హైదరాబాద్‌లో జరగనున్న బతుకమ్మ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. బిసిలకు విద్య ఉద్యోగ రాజకీయాల్లో 42శాతం రిజర్వేషన్లు పెంచాలని 22 నెలలుగా బిసిలు పోరాటం చేస్తున్నా కేంద్రప్రభుత్వం దిగిరావడం లేదని ఆవేదన వ్యక్తపరిచారు. రాష్ట్ర అసెంబ్లీలో చట్టం చేసినా కేంద్రం తొక్కిపెట్టిందని ఆరోపిస్తూ రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ బిసి వ్యతిరేక వైఖరి విడనాడి మనస్సు మారాలని బతుకమ్మ పండుగను బిసి మహిళలు వేదికగా చేసుకొని పోరాడుతున్నారని ఆయన అన్నారు. బి.మణి మంజరి మాట్లాడుతతూ ఈ బతుకమ్మ వేదికగా మహిళా బిల్లులో బిసి మహిళలకు సబ్‌కోటా కల్పించాలని ప్రధాన మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బిసి మహిళా సంఘాల నేతలు తారకేశ్వరి, సమత, సంధ్య, సుజాత, శ్యామల, గౌతమి, వీణదేవి, రాజేశ్వరి, శైలజ, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## స్వస్థ నారీ, సశక్త్ పరివార్ అభియాన్‌ను ఉపయోగించుకోండి : మాజీ కార్పొరేటర్



మహిళలకు అవగాహన కల్పిస్తున్న సురేష్ రెడ్డి

**జీడిమెట్ల, సెప్టెంబర్ 20, ప్రభాతవార్త**
సుభాష్ నగర్ డివిజన్‌లో స్వస్థ నారీ, సశక్త్ పరివార్ అభియాన్ పేరిట నిర్వహిస్తున్న ప్రత్యేక ఆరోగ్య కార్యక్రమాన్ని సూరారం కాలనీలో గల పట్టణ ఆరోగ్య కేంద్రంలో ప్రారంభిస్తు, మహిళలు పిల్లలు అందరు వినియోగించుకోవాలని మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి కోరారు. ఈసందర్భంగా సురేష్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన స్వస్థ నారీ, సశక్త్ పరివార్ అభియాన్ 15 రోజులపాటు దేశవ్యాప్తంగా ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఇతర ఆరోగ్య కేంద్రాల్లో పెద్ద ఎత్తున ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ శిబిరాల్లో గైనకాలజిస్టులు, నేత్ర వైద్యులు, చర్మ వైద్యులు, మానసిక వైద్యులు, డెంటల్ డాక్టర్లు అందుబాటులో ఉంటారని వెల్లడించారు. మహిళలంతా ఈ సేవలను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శరనాజ్, స్పెషలిస్ట్ డాక్టర్ అంజలి మాధురి, ల్యాబ్ టెక్నీషియన్ బి రమేష్, ఫార్మసిస్ట్ నవీన్, ఏఎన్ఎం రాజేశ్వరి, మహిళలు స్థానికులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


### అభివృద్ధికి ఎల్లవేళలా కృషి : మైనంపల్లి హనుమంతరావు



మైనంపల్లి హనుమంత రావును సన్మానిస్తున్న ప్రజలు

**పేట్ బషీరాబాద్, సెప్టెంబర్ 20, ప్రభాతవార్త**
ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత రావు అన్నారు. శనివారం కుత్బుల్లాపూర్, జీడిమెట్ల డివిజన్‌లోని వుడ్ కాలనీ, వైష్ణవి అపర్ణ కాలనీలకు డ్రైనేజీ, రోడ్లు మంజూరు చేయించి నందుకు వారి కాలనీలలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత రావును ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, రవీందర్ గౌడ్, సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బతుకమ్మ వేడుకలు...



ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బతుకమ్మ వేడుకలలో పాల్గొన్న అధ్యాపకులు.

**బేగంపేట సెప్టెంబరు 20,ప్రభాతవార్త**
బేగంపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి.ఈ సందర్భంగా విధ్యార్థులకు,అధ్యాపకులకు,కార్యాలయ బృందానికి బతుకమ్మ పోటీలు నిర్వహించారు.బతుకమ్మ స్ఫూర్తిని విధ్యార్థులు, అధ్యాపకులు కొనసాగించారు అని కళాశాల ప్రిన్సిపాల్ డా. కె.పద్మావతి ప్రశంసించారు.సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి వైస్ ప్రిన్సిపాల్ టి.భాస్కరరెడ్డి, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ డా.అనీషెరాన్ పరిక్షల విభాగాధిపతి డా.పుష్ప,పరిపాలనా విభాగం అధిపతి దివేఖ్ శుక్లా,సూపరిండెంట్ విమల్ మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

### కొలన్ హన్మంత్ సమక్షంలో కాంగ్రెస్‌లోకి చేరికలు

**నిజాంపేట్, సెప్టెంబర్ 20, ప్రభాతవార్త**
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ 13వ డివిజన్ వాసులు శనివారం కాంగ్రెస్‌లో చేరారు. నిజాంపేట్ కార్పొరేషన్ మహిళ అధ్యక్షురాలు కడియాల ఇందిరా ఆధ్వర్యంలో 100 మందికి పైగా కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్చార్జీ కొలన్ హన్మంత్ రెడ్డి వారిని పార్టీలోకి ఆహ్వానించారు.

### వెంకటరావు పేట్ బస్తీ సమస్యలు పరిష్కరిస్తాం: కార్పొరేటర్



బస్తీ పర్యటనలో కార్పొరేటర్

**అల్వాల్, సెప్టెంబరు 20 ప్రభాతవార్త:**
బస్తీ వాసులు సమస్యలు పరిష్కారానికి చిత్త శుద్ధితో పని చేస్తున్నామని అల్వాల్ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని వెంకటరావు పేట్‌లో అధికార యంత్రాంగంతో కలిసి పర్యటించారు. డబుల్ బెడ్ రూము ఇళ్ళు, రేషన్ కార్డులు, రోడ్లు, డ్రైనేజీ లీకేజీలు, బోర్‌వెల్ తదితర సమస్యలను బస్తీ వాసులు కార్పొరేటర్ దృష్టికి తెచ్చారు. సమస్యలను అతి త్వరలోనే పరిష్కరించడం జరుగుతుందని శాంతి శ్రీనివాస్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఇ వరుణ్, జలమండలి శేఖర్ నేతలు ప్రేమ్, సాజిద్ తదితరులు పాల్గొన్నారు.

## జడ్‌సికి వీధి వ్యాపారుల వేడుకోలు



జడ్‌సికి వినతి పత్రం అందిస్తున్న వ్యాపారులు

**అల్వాల్, సెప్టెంబరు 20 ప్రభాతవార్త:** రోడ్డుపై చిరు వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న తమను వెళ్ళి పోవాలని ఆదేశాల జారీ చేయడం ఎంత వరకు సమంజసమని వెంకటాపురం డివిజన్‌కు చెందిన వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భూదేవినగర్ పార్కు వద్ద తోపుడు బండ్లపై వ్యాపారం చేసుకుంటున్న వారిని జిహెచ్ఎంసి ఇటీవల ఖాళీ చేయాలని హుకూం జారీ చేసింది. ఈ నేపథ్యంలో డివిజన్ బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత అనీల్ కిషోర్ ఆధ్వర్యంలో వ్యాపారులు శనివవారం జడ్‌సి అపూర్వ చౌహాన్‌ను కలిసి వినతి పత్రం అందించారు. రోడ్డు జీవనాధరంగా ఉన్న వారు ఎక్కడికి వెళతారని ప్రత్యామ్నాయం చూపించాలని జడ్‌సిని అనీల్ కిషోర్ కోరారు. ఈ కార్యక్రమంలో రాజు, రమేష్, శివ, పరమేష్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

### బీఆర్ఎస్ అందించిన పథకాలను ఇంటింటికి తీసుకెళ్లాలిః మాగంటి సునీత

**యూసుఫ్‌గూడ, సెప్టెంబర్ 20, ప్రభాతవార్త :**
ప్రజలకు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అందించిన సంక్షేమ పథకాలే రాబోయే ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలుపునకు దోహదపడతాయని రహమత్‌నగర్ మాజీ కార్పొరేటర్ మహ్మద్ అబ్దుల్ షఫీ అన్నారు. శనివారం రహమత్‌నగర్ డివిజన్ పరిధిలోని శ్రీరామ్‌నగర్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మహ్మద్ అబ్దుల్ షఫీ ఆధ్వర్యంలో డివిజన్ బూతు కమిటీ సమావేశం ముఖ్య అతిథిగా దివంగత శాసనసభ్యులు మాగంటి గోపినాథ్ సతీమణి మాగంటి సునీత పాల్గొన్నారు. డివిజన్ పరిధిలో 75 బూతులు ఉన్నాయని దాదాపు 72 వేల 138 ఓటర్లు ఉన్నారని బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పేదలకు అందించిన పథకాలను నేరుగా ఇంటింటికి వెళ్లి వివరించాలన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం బీఆర్ఎస్‌ను గెలిపించుకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రజలందరికీ చాలా వరకు మంచి జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లియాకత్ అలీ, నాగరాజు, కేఎన్‌రెడ్డి, అరుణ్‌కుమార్, దనూజా, రహీమ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

### న్యాయవాది పేరుతో మమ్మల్ని మోసం చేశాడు

**తమను ఆదుకోవాలని ప్రభుత్వానికి బాధితుల విజ్ఞప్తి**

**హైదరాబాద్, సెప్టెంబర్ 20, ప్రభాతవార్త:**
తమ వద్ద నుండి డబ్బులు తీసుకొని కేసు వెయ్యకుండా ఇబ్బందులు పెట్టడమే కాకుండా ప్రశ్నించినందుకు తమపైనే దూషణలకు దిగుతూ బెదిరింపులకు గురి చేస్తున్నాడని ఒక న్యాయవాదిపై బాధితులు రత్న కుమారి, కొమ్మనాపల్లి గణపతి రావులు ఆరోపించారు. ఈమేరకు శనివారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రత్న కుమారి, గణపతి రావు బాధితులు మాట్లాడుతూ తమకు సంబందించిన కేసుల విషయంలో తాను న్యాయస్థానంలో కేసును వాదిస్తానంటూ ఒకన్యాయవాది డబ్బులు తీసుకొని నమ్మబలికాడని, తీరా కేసు వేయకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నాడని, ఆయనపై ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ లో ఫిర్యాదు చేస్తే అతని మెంబర్ షిప్ తొలగించారని, ప్రస్తుతం అతను ఎవరికి కనిపించకుండా తిరుగుతున్నాడని, తాము నలుగురం ఇరవై లక్షలు నష్టపోగా, మొత్తం ఆయన బాధితులందరు దాదాపు పది కోట్ల వరకు నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో రమణి,శేషు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేలా 'బతుకమ్మ సంబురాలు'



'బతుకమ్మ సంబురాలు' వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్, శ్రవంతి సగర తదితరులు

**సైఫాబాద్, సెప్టెంబరు 20 ప్రభాతవార్త:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేలా ఈ నెల 24వ తేదీ సాయంత్రం ట్యాంక్‌బండ్ మీదగల బతుకమ్మ ఘాట్ వద్ద 'బతుకమ్మ సంబురాలు' ఘనంగా నిర్వహిస్తున్నామని తెలంగాణ సగర మహిళా సంఘం తెలిపింది. ఈ మేరకు ఈ సంబురాలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు గాండ్ల శ్రవంతి సగర తదితరులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ సంబురాల్లో జంటనగరాల్లో సగర మహిళలేకాకుండా రాష్ట్ర నలుమూలల సగర మహిళలు వేలాది మంది పాల్గొంటారని చెప్పారు. ఎన్నో ప్రాజెక్టులు, భవనాలు, కట్టడాల నిర్మాణంలో భాగస్వాములైన సగరులను ప్రభుత్వాలు, సమాజం గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో సగరులను సమాజంతోపాటు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించాలనే ఉద్దేశ్యంతోనే ప్రతి ఏడాది ట్యాంక్‌బండ్‌పైన బతుకమ్మ సంబరాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర మంత్రులు సీతక్క, కొండా సురేఖ తదితరులు పాల్గొంటారని వారన్నారు. సగరులు అన్ని రంగాలలో అభివృద్ధి చెందడానికి బిసి డి గ్రూప్‌లో ఉన్న ఉన్న వీరిన బిసి ఏ గ్రూప్‌లోకి మార్చాలని, మైనార్టి మహిళలకు ప్రభుత్వం ప్రకటించిన పథకాలు 50 వేలు, లక్ష రూపాయలు, సగర మహిళలకు కూడా వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఓటు బ్యాంక్ రాజకీయాలకు పాల్పడరాదని హెచ్చరించారు. ఈ సమావేశంలో కుందారం గణేషాచారి, మణిమంజిరి, రవి సగర, హరికిషన్ సగర, సత్యం సగర తదితరులు పాల్గొన్నారు.

## బతుకమ్మకుంట ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేయాలి : వి.హనుమంతరావు



బతుకమ్మకుంట ప్రారంభోత్సవానికి రావాలని బతుకమ్మలతో గోల్నాకలో ప్రచారం నిర్వహిస్తున్న మాజీ ఎంపి వి.హనుమంతరావు, చిత్రంలో పోలినేని పద్మ రామ్మోహన్ రావు తదితరులు

**హైదరాబాద్, సెప్టెంబరు 20 ప్రభాతవార్త:**
బతుకమ్మకుంట ప్రారంభోత్సవానికి రాజకీయాలకు అతీతంగా మహిళలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిసిసి మాజీ అధ్యక్షుడు, మాజీ ఎంపి వి.హనుమంతరావు పిలుపు నిచ్చారు. శనివారం గోల్నాక డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పోలినేని పద్మ రామ్మోహన్‌రావు ఆధ్వర్యంలో బతుకమ్మలతో ఇంటింటికి వెళ్లి బతుకమ్మకుంట ప్రారంభోత్సవ ఆహ్వాన పత్రికను అందజేశారు.ఈ సందర్భంగా విహెచ్ మాట్లాడుతూ ఈ నెల 26న సీఎం రేవంత్‌రెడ్డి బతుకమ్మకుంట ప్రారంభోత్సవానికి వస్తున్నారని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. గత 35 ఏళ్లుగా కబ్జాలో ఉన్న బతుకమ్మకుంటను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, హైడ్రా కమిషనర్ రంగనాథ్ సహకారంతో తిరిగి దక్కించుకున్నామని. బతుకమ్మకుంటలో బతుకమ్మ ఆడే విధంగా ఏర్పాట్లు అన్ని చేశామని చెప్పారు.పార్టీ సీనియర్ నాయకులు పోలినేని పద్మ రామ్మోహన్‌రావు మాట్లాడుతూ వి.హనుమంతరావు పోరాటం ఫలితంగా బతుకమ్మకుంట దక్కిందని, బతుకమ్మకుంటకు వి.హనుమంతరావు పేరు పెట్టాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు దిడ్డి రాంబాబు, పులి జగన్, నారాయణస్వామి,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గరిగంటి రమేష్, తొలుపునూరి కృష్ణగౌడ్, గడ్డం శ్రీధర్‌గౌడ్, కిషన్, లక్ష్మణ్, అజయ్‌కుమార్ మహిళా నాయకురాలు విజితా రెడ్డి, శాంతమ్మ, తదితర నాయకులు పాల్గొన్నారు.

### ప్రజా ప్రభుత్వంలో ప్రజల వద్దకే పాలన ఆచరణ అమోఘం



లబ్ధిదారులకు చెక్కును అందజేస్తున్న బండి రమేష్

**కెపిహెచ్బి కాలనీ, సెప్టెంబర్ 20, ప్రభాతవార్త**
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో పనిచేస్తున్నది ప్రజా ప్రభుత్వమని నిరంతరం ప్రజలకు అందుబాటులో అండగా ఉంటుందని టిపిసిసి ఉపాధ్యక్షుడు, జహీరాబాద్ పార్లమెంట్ ఇంచార్జ్, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి బండి రమేష్ పేర్కొన్నారు. నియోజకవర్గ పరిధిలోని ఫతేనగర్ డివిజన్లో సీఎం రిలీఫ్ ఫండ్ పథకం ద్వారా మంజూరైన చెక్కులను ఇద్దరు లబ్ధిదారులకు రమేష్ స్వయంగా వారి ఇంటికి వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎంఆర్ఎఫ్ చెక్కుల ను నేరుగా లబ్ధిదారుల ఇంటికి వెళ్లి ఇవ్వడం ద్వారా రేవంత్ రెడ్డి ప్రభుత్వం కొత్త సాంప్రదాయానికి నాంది పలికిందని అన్నారు. మూతపడిన ఐడియల్ కంపెనీ ఎన్నో ఏళ్లుగా వాటర్ వర్క్స్‌కు సుమారు రూ.40 కోట్లు బాకీ పడిందనీ ఈ కారణంతో కంపెనీలో పనిచేసి రిటైర్ అయిన 170 కుటుం బాలకు వాటర్ వర్క్స్ సంస్థ నీటి సరఫరాను నిలిపివేసిందని సదరు బాధితులు రమేష్‌కి సమస్యను విన్నవించడంతో ఆ యన వాటర్ వర్క్స్ యాజమాన్యంతో మాట్లాడి వెంటనే నీటి సరఫరాను పునరుద్ధరించేలా చర్యలు తీసుకున్నారు. దీంతో వారు రమేష్‌కి వాటర్ వర్క్స్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు లక్ష్మయ్య, కుక్కల రమేష్, అరుణ్,మధు, నర్సింగరావు,శివా చౌదరి రాజేందర్,జ్యోతి, రజిని పాల్గొన్నారు.

### స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో రోగులకు మెరుగైన సేవలు



స్వచ్ఛంద సంస్థ అందజేసిన బల్లాలను పరిశీలిస్తున్న వైద్య బృందం

**సికింద్రాబాద్, సెప్టెంబర్ 20 ప్రభాతవార్తః**
గాంధీ ఆస్పత్రిలో చర్మ, సుఖ వ్యాధుల ప్రత్యేక శిభిరం శనివారం ఉదయం ఏర్పాటు చేసిన శిబిరాన్ని డాక్టర్ వాణి ప్రారంభించారు. అనంతరం ఆమే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఉచిత వైద్య శిభిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ వారు ఇచ్చిన బల్లలను, స్ట్రెచర్స్ లను పరిశీలించారు. స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి ప్రజల కోసం పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్, ఆర్.యం.ఓ డాక్టర్ శేషాద్రి, డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, డాక్టర్ రజని, డాక్టర్ నజీం, డాక్టర్ యోగి,డాక్టర్ మీనాక్షి, డాక్టర్ సరిత ,డాక్టర్ డాక్టర్ తభసుం, డాక్టర్ శంకర్ ఇతర చర్మ వైద్యులు పాల్గొన్నారు.

## సేవాయే పక్వాడ్‌లో చిత్రలేఖనం పోటీలు



**కొత్తూరు, సెప్టెంబర్ 20, ప్రభాతవార్త;**
సేవా పక్వాడు కార్యక్రమం ద్వారా కొత్తూరులో విద్యార్థుల చిత్రలేఖనం పోటీ. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జన్మదిన వేడుకలలో భాగంగా సేవాయే పక్వాడ్ కార్యక్రమం కింద కొత్తూరు మున్సిపల్ కేంద్రంలోమున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షులు అమడపురం రణధర్ గౌడ్ ఆధ్వర్యంలో కృష్ణవేణి టాలెంట్ స్కూల్ లో చిత్రలేఖనం పోటీని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మహబూబ్‌నగర్ పార్లమెంట్ కో కన్వీనర్ అమడపురం నరసింహ గౌడ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో, విద్యార్థులకు మోడీ చేపట్టిన వికసిత్ భారత్, ఆత్మనిర్భర్ భారత్, ఆపరేషన్ సింధూర వంటి అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన కలిగించే ఉద్దేశ్యంతో ఈ డ్రాయింగ్ పోటీ నిర్వహించబడింది. పోటీలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కొత్తూరు మున్సిపాలిటీ ప్రధాన కార్యదర్శి కోస్గి మల్లేష్, ఉపాధ్యక్షులు ఏనుగు విజయభాస్కర్ రెడ్డి, ప్రభాకర్, కార్యదర్శి శివ నాయక్, యువమోర్చా నాయకులు మైలారం శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

### డెంగ్యూ బారిన పడి 8 ఏళ్ల చిన్నారి మృతి

**- గ్రామంలో విషాదం పారిశుధ్య లోపాలపై గ్రామస్తుల ఆగ్రహం**

**కొత్తూరు, సెప్టెంబర్ 20, ప్రభాతవార్త:**
కొత్తూరు మండలంలోని ఎస్.బి.పల్లి గ్రామంలో డెంగ్యూ జ్వరంతో ఎనిమిదేళ్ల చిన్నారి వాసు ప్రియ మృతి చెందడం గ్రామంలో విషాదాన్ని నింపింది. ఈ ఘటనపై గ్రామస్తులు, కుటుంబ సభ్యులు స్థానిక అధికారుల నిర్లక్ష్యాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. చిన్నారి ఇంటి పరిసరాల్లో చెట్లు, చెత్త కుప్పల కారణంగా దోమలు పెరిగి ఈ దుర్ఘటన జరిగిందని వారు ఆరోపించారు. పారిశుధ్య సమస్యలపై అధికారులు పట్టించుకోలేదని గ్రామస్థులు వాపోయారు. ప్రియకు జ్వరం రావడంతో మొదట సమీప గ్రామమైన కోళ్లపడకల్‌లోని ఒక ఆర్ఎంపి వైద్యుడిని సంప్రదించారు. అయితే పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ శనివారం ఉదయం తుదిశ్వాస విడిచిందని కుటుంబ సభ్యులు రోదిస్తూ తెలిపారు. ఈ ఘటనతో గ్రామంలో భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. పారిశుధ్య నిర్వహణలో కఠిన చర్యలు తీసుకోవాలని, దోమల నివారణ చర్యలు చేపట్టాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తక్షణమే స్పందించి ప్రజల ఆరోగ్య భద్రతకు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

## తెలంగాణ మహిళల పండుగ బతుకమ్మ



కురిమిద్ద పాఠశాలలో బతుకమ్మ సంబరాలు

**యాచారం సెప్టెంబర్ 20 ప్రభాతవార్త..**
తెలంగాణ మహిళల పండుగగా బతుకమ్మ పండుగ పేరు గాంచిందని కురిమిద్ద ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్తు పాండురంగారెడ్డి అన్నారు. శనివారం ఆచారం మండల పరిధిలోని కుర్మిద్ద ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ఘనంగా బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ స్త్రీల అస్తిత్వానికి అద్దం పట్టే బతుకమ్మ పండుగలో మహిళల మనోభావాలు, కళలు ఆవిష్కృత మవుతాయని అన్నారు. రంగు రంగుల పూలతో అలంకరించిన బతుకమ్మ ప్రకృతిలో మమేకం కావడం గురించి తెలియజేస్తుందని వారు అన్నారు. పూల తరువాత ఈ పండగ పాటలకు ప్రసిద్ధి గాంచిందని వారు తెలిపారు. ఈ పాటలలో మహిళలు తమ కష్టసుఖాలు, ప్రేమానురాగాల గురించి ప్రస్తావిస్తారని వారు తెలిపారు. ఈ పాటలు నేర్చుకోవడం, పాడటం ద్వారా విద్యార్థులలో ధారణ శక్తి పెరుగుతుందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు స్వప్న, రాణి, శ్రీను, అశోక్, వీరమణి, శ్రీదేవి, శోభ, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

## సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన

**నిజాంపేట్, సెప్టెంబర్ 20, ప్రభాతవార్త**
నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 2వ డివిజన్ శ్రీ విజయ దుర్గ నగర్ కాలనీ (జిపిఆర్ లేఔట్)లో సీసీ రోడ్డు పూర్తిగా పాడువటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కాలనీ వాసులు నియోజకవర్గ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సానుకూలం గా స్పందించి కార్పొరేషన్ ఫండ్స్ ద్వారా రూ.38 లక్షల సీసీ రోడ్ నిర్మాణానికి మంజూరు చేయించారు. మంజూరైన నిధులతో శనివారం కొలన్ హన్మంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి శంకుస్థాపన చేశారు. అనం తరం కాలనీ వాసులు శాలువాతో సత్కరించి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, జనరల్ సెక్రటరీ జీవన్ రెడ్డి, 2వ డివిజన్ అధ్యక్షు లు సురగాని వీరబాబు గౌడ్, కమిటీ అధ్యక్షులు అంబారెడ్డి వంగల, రాకేష్ రెడ్డి సంకెపల్లి, మురళి, రవీందర్ రెడ్డి, సంతోష్ రెడ్డి, హరీష్, జెగ్గా మధుసూదన్ రెడ్డి, సురేందర్ కుమార్, గూడూరు మురళి కృష్ణ, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

## నేషనల్ హైవేపై స్వచ్ఛతోత్సవం



రోడ్డుపై ఊడుస్తూ, పరిసరాలను శుభ్రంచేస్తున్న దృశ్యం

**నారాయణఖేడ్, సెప్టెంబరు 20, ప్రభాతవార్త:**
నిజాంపేట మండలకేంద్రంలో స్వచ్ఛతోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. శనివారం స్థానిక ఐఎంఎస్ టీం ఆధ్వర్యంలో నేషనల్ హైవే 161 పి2 సిబ్బంది, కార్మికులు, అత్యవసర సేవలు వాహనం స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో భాగంగా స్థానిక ఆఫీస్‌నుంచి హైవేరోడ్డుపై బైక్‌ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం స్థానిక అండర్ లోయర్ బ్రిడ్జి కింద బిటిరోడ్డుపై ఊడ్చి పరిసరాలను శుభ్రంచేశారు. కార్యక్రమంలో ఎస్‌పివి సిబ్బంది, ఆర్‌ఎం లేబర్లు పాల్గొన్నారు.

## సిర్గాపూర్ జడ్పిహెచ్‌ఎస్‌లో పోషకుల సమావేశం



సిర్గాపూర్ జడ్పిహెచ్‌ఎస్‌లో పోషకుల సమావేశం దృశ్యం

**సిర్గాపూర్, సెప్టెంబరు 20, ప్రభాతవార్త:**
మండలకేంద్రమైన సిర్గాపూర్‌లోని పిఎంశ్రీ జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో శనివారం విద్యార్థులు, పోషకులు, ఉపాధ్యాయులతో ముఖాముఖి సమావేశం నిర్వహించారు. విద్యలో విద్యార్థుల నెలరోజుల ప్రగతిని వివరించారు. విద్యార్థుల ప్రగతి కోసం ప్రతి తల్లిదండ్రులు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. సెల్‌ఫోన్, టివిలకు దూరంగా విద్యార్థులు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పోషకులు అంజయ్య, నర్సగౌండ, బల్‌రామ్, నర్సింలు, రవీందర్, విఠమ్మ, నాగయ్య, శాంత, పద్మ, రాజు, వీరారెడ్డి, ఉపాధ్యాయులు ఐసి ప్రధానోపాధ్యాయులు లక్ష్మణ్, నిహారిక, వరప్రకాష్, నాగభూషణం, సిచన్, అన్సార్, శ్రీరామ్, నిర్మల, మధుకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నూతన మండల టిఎస్ యటిఎఫ్ కార్యవర్గం

**చౌటకూరు, సెప్టెంబరు 20, ప్రభాతవార్త:**
మండల టిఎస్ యుటిఎఫ్ నూతన కార్యవర్గాన్ని శనివారం జిల్లా ఎన్నికల అధికారి శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షులుగా పత్రి కిషన్, ప్రధానకార్యదర్శిగా ధను, ఉపాధ్యక్షులుగా కౌసల్యదేవి, సూర్యనారాయణ, కోశాధికారిగా స్వప్న, ఆడిటర్‌గా అర్జున్, పిడబ్ల్యుఎఫ్ కన్వీనర్‌గా కృష్ణమూర్తి, కార్యదర్శులుగా వినోద, శ్రీదేవి, శశి, సందీప్ సంతోష్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలంలో టిఎస్ యుటిఎఫ్‌ను బలపరుస్తూ జిల్లాకమిటీ సూచనలు పాటిస్తామని నూతనకమిటీ బాధ్యులు హామీచేశారు.

## వికలాంగుల పింఛన్ 6వేలకు పెంచాలి

**-ఆర్డీవో కార్యాలయం ముందు ఒకరోజు నిరాహార దీక్ష**



నిరాహార దీక్ష చేస్తున్న వికలాంగులు

**జోగిపేట, సెప్టెంబరు 20, ప్రభాతవార్త:**
రాష్ట్రప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చినహామీ మేరకు వెంటనే వికలాంగులకు రూ.6వేలు పింఛన్ ఇవ్వాలని డిమాండ్‌చేస్తూ వికలాంగుల హక్కులవేదిక ఆధ్వర్యంలో శనివారం ఆందోల్ ఆర్డీవో కార్యాలయం ముందు ఒకరోజు నిరహారదీక్ష చేపట్టారు. ఈసందర్భంగా వికలాంగుల హక్కులవేదిక జిల్లా ఉపాధ్యక్షులు సుభాష్ మాట్లాడుతూ, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి సంవత్సరంన్నర గడుస్తున్నా ఇప్పటికీ పింఛను పెంచే విషయంలో ప్రభుత్వంనుంచి ఎలాంటి స్పందనలేదని విమర్శించారు. అలాగే కొత్త పింఛన్ల కోసం చాలామంది ఎదురు చూస్తున్నారని అన్నారు. సాధ్యమైనంత త్వరగా ప్రభుత్వం పింఛన్ మొత్తాన్ని 6వేలకు పెంచి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో వికలాంగుల హక్కులవేదిక నాయకులు రామచందర్, శ్రీనివాస్గౌడ్, ఖలీల్ మియా, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

## ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలి



గ్రామపంచాయతీ ముందు ధర్నా నిర్వహిస్తున్న పెన్షన్ దారులు

**ధూళిమిట్ట, సెప్టెంబరు 20, ప్రభాతవార్త:**
కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని ధూళిమిట్ట గ్రామపంచాయతీ ముందు వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, ఒంటరి మహిళలు, చేనేత, గొంగడినేత, కల్లుగీత కార్మికులు ధర్నానిర్వహించి పంచాయతీకార్యదర్శికి వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో పెన్షన్‌దారులకు పెన్షన్లు పెంచుతామని హామీ ఇచ్చి, గెలిచాక కాలయాపన చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా ఇచ్చినమాట ప్రకారం హామీలను నెరవేర్చాలని వారు డిమాండ్‌చేశారు.

## పంట నమోదు వెంటనే ప్రారంభించాలి

**-సిపిఎం పార్టీ నియోజకవర్గ నాయకులు గుగులోతు శివరాజ్**

**హుస్నాబాద్ రూరల్, సెప్టెంబరు 20, ప్రభాతవార్త:**
ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగుచేసుకున్న పంటలను ప్రభుత్వం వెంటనే నమోదుచేసుకోవాలని సిపిఎం పార్టీ నియోజకవర్గ నాయకులు గుగులోతు శివరాజ్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణ కేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నాలుగు నెలలు గడుస్తున్నా, ఇప్పటివరకు ప్రభుత్వం పంట నమోదుప్రక్రియ ప్రారంభించకపోవడం వల్ల రైతులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి వచ్చే ప్రమాదం ఉందన్నారు. రైతులు సాగుచేసుకున్న పంటలను ప్రభుత్వ కొనుగోలుసెంటర్లలో మద్దతుధరలకు అమ్ముకోవాలంటే పంట ఆన్‌లైన్ నమోదు అనేది తప్పనిసరి అని నాలుగునెలలు గడిచినా పంటలనమోదు ప్రారంభించలేదని, ఇప్పటికైనా రైతుల పంట దిగుబడి రాకముందే వ్యవసాయశాఖ అధికారులు పంటలు నమోదు చేసుకోవాలని ఆదేశాలు జారీ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో వ్యవసాయశాఖ ఎడి కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీనాయకులు గుగులోతు రాజునాయక్, వినోద్‌రావు, నవీన్, హరీష్, శ్రీయాన్స్, వెంకటేష్‌తో పాటు తదితరులు ఉన్నారు.

# ఊరచెరువు ముంపునకు శాశ్వత పరిష్కారం చూపాలి

**-బిజెపి నాయకులు**



రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తంచేస్తున్న బిజెపి నాయకులు

**గజ్వేల్, సెప్టెంబరు 20, ప్రభాతవార్త:**
గజ్వేల్ పట్టణంలో ప్రజ్ఞాపూర్ ఊరచెరువు కాలువలను మూసివేయడం వలన పలు కాలనీలు, హాస్పిటల్స్ ముంపుకు గురవడం జరుగుతుందని, ఈసమస్యకు జిల్లా కలెక్టర్, మున్సిపల్ అధికారులు వెంటనే చర్యలు చేపట్టాల డిమాండ్ చేస్తూ శ్రీపార్థేశ్వర దేవాలయం కాలనీవాసులకు మద్దతుగా బిజెపి ఆధ్వర్యంలో మెయిన్ రోడ్డుపై బైఠాయించి నిరసన, ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ బిజెపి అధ్యక్షులు దేవులపల్లి మనోహర్ యాదవ్‌లు మాట్లాడారు. ప్రజావాణి కార్యక్రమంలో సమస్యను పరిష్కరించాలని జిల్లాకలెక్టర్‌కు వినతిపత్రం అందజేసినా లాభంలేదన్నారు. బిఆర్ఎస్, కాంగ్రెస్‌పార్టీ ప్రభుత్వాలు ఉన్నప్పుడు చేసిన నిర్లక్ష్యం వలనే ఈరోజు గజ్వేల్‌పట్టణ ప్రధానరోడ్డు, పలు కాలనీలు, ఆసుపత్రులు ముంపుకు గురికావడం జరుగుతుందన్నారు. గతంలో కాలువలు మూసినవారిపై చర్యలు తీసుకుంటామని చెప్పినా ఫలితం శూన్యమన్నారు. బిఆర్ఎస్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి వెంచర్‌కోసం కాల్వలను పూడ్చడంతో ఈదుస్థితి వచ్చిందన్నారు. డిసిసి అధ్యక్షులు తూంకుట నర్సారెడ్డి కబ్జాతో తూప్రాన్ రోడ్ ముంపుకు గురికావడం జరిగిందన్నారు. ఈ సమస్యకు పరిష్కారంమార్గం చూపాలని, లేనిపక్షాన బిజెపి ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కుడిక్యాల రాములు, కమ్మరి శ్రీను, నత్తి శివకుమార్, రమేష్, వెంకటరెడ్డి, సుభాష్‌చంద్రబోస్, రామచంద్రచారి, మద్దులూరి నరసింహ, వడ్డేపల్లి ప్రసాద్, నాగు, మహేందర్, కొలుపుల నరేందర్, సందీప్, కోటేస్వామి, నిరంజన్‌రెడ్డి, మధు, రాజేశ్వరిచారి, సాయి, నరేష్, సాయి, అభినాష్‌చారి, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి

**-మోడల్ స్కూల్‌ను పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే**



బాలికల వసతిగృహాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

**నాగల్‌గిద్ద, సెప్టెంబరు 20, ప్రభాతవార్త:**
మండలంలోని మోర్గి మోడల బాలికల వసతిగృహంలో విద్యార్థినులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి డిమాండ్‌చేశారు. శనివారం మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి మోర్గిగ్రామంలోని మోడల్ బాలికల వసతిగృహాన్ని పరిశీలించి విద్యార్థినులు ఎదుర్కొంటున్న సమస్యలను వారిని అడిగి తెలుసుకున్నారు. వసతిగృహంలో తాగునీటి సమస్య ఉందని, విద్యార్థినులకు తాగునీటి సౌకర్యం కల్పించకుంటే ఎలా అని ప్రశ్నించారు. ఇదిలా ఉండగా నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమాహారతి వసతిగృహాన్ని స్థానిక అధికారులతో కలిసి సందర్శించి వసతిగృహంలో నెలకొన్న సమస్యలను విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. వసతిగృహంలోని సమస్యలను పరిష్కరిస్తామని సబ్ కలెక్టర్ ఉమాహారతి భరోసా ఇచ్చారు. సబ్‌కలెక్టర్ వెంట తహసీల్దార్ శివకృష్ణ, ఎంపిడిఓ మహేశ్వరరావు తదితరులు ఉన్నారు.

## పెన్షన్‌లు పెంచాలంటూ...
## చేయూత పింఛనుదారుల ధర్నా



పంచాయతీకార్యదర్శికి వినతిపత్రం అందచేస్తున్న చేయూతపెన్షన్‌దారులు

**కంది, సెప్టెంబరు 20, ప్రభాతవార్త:**
చేయూతపెన్షన్‌లను పెంచాలని డిమాండ్‌చేస్తూ శనివారం మండల పరిధిలోని కాశీపూర్‌గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద చేయూత పెన్షన్‌దారులు ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా మాదిగ మహిళాసమాఖ్య రాష్ట్ర నాయకురాలు పెద్ద గీతమాదిగ మాట్లాడుతూ మంద కృష్ణమాదిగ ఆదేశాల మేరకు పంచాయతీ కార్యాలయం వద్ద ధర్నానిర్వహించి పంచాయతీ కార్యదర్శి రమేష్‌కు పెన్షన్‌లను రూ.6వేల పెంచాలని డిమాండ్‌చేస్తూ వినతిపత్రం అందచేశామన్నారు. ఇతరపెన్షన్‌లను రూ.4వేలకు పెంచాలని, కొత్తగా దరఖాస్తులు చేసుకున్నవారికి పెన్షన్‌లు మంజూరు చేయాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో విహెచ్‌పిఎస్, సిహెచ్‌పిస్ చేయూతపెన్షన్‌దారులు, ఎంఎస్‌పి జిల్లా అధ్యక్షురాలు కుమ్మరి పల్లవి, విహెచ్‌పిఎస్ సమీనాబేగం, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ యువజన సంఘం ఆవిర్భావ దినోత్సవం

**అక్కన్నపేట, సెప్టెంబరు 20, ప్రభాతవార్త:**
తెలంగాణరాష్ట్ర అంబేద్కర్ యువజనసంఘం 49వ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతంచేయాలని ఆసంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి చెప్యాల ప్రకాష్ పిలుపునిచ్చారు. శనివారం మండలకేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈనెల 21(నేడు) ఆదివారం హన్మకొండలోని అంబేద్కర్ భవన్‌లో నిర్వహించబోయే ఈసభకు ముందు భారీర్యాలీ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈసభకు అన్నివర్గాల ప్రజలు పెద్దయెత్తునపాల్గొని విజయవంతంచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘంనాయకులు ఎల్లయ్య, మ్యాక రమేష్, సారయ్య, కార్తీక్, జగదీష్, రాజుతోపాటు తదితరులు ఉన్నారు.

## భావి తరాలకు అందించే
## గొప్ప సంస్కృతి మన బతుకమ్మ పండగ

**-మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు**



బతుకమ్మ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న హరీష్‌రావు

**సిద్దిపేట, ప్రభాతవార్తప్రతినిధి:**
భావితరాలకు అందించే గొప్ప సంస్కృతి మన బతుకమ్మ పండగ అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు అన్నారు. ఉపాధ్యాయురాలు విజయ రూపొందించిన బతుకమ్మ పుస్తకాన్ని శనివారం హైదారాబాద్‌లో హరీష్‌రావు చేతులమీదుగా ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సాంకేతికత రావడంతో పుస్తకాల్లో పాడేసంస్కృతి దూరం అవుతుందన్నారు. ప్రకృతిని ప్రేమించే...స్త్రీ శక్తికి ప్రతీక బతుకమ్మ అన్నారు. తెలంగాణ జీవన విధానాలు, కుటుంబ విలువలు పండుగలో ప్రతిబింబిస్తాయన్నారు. కాగా జిల్లా ప్రజలకు ఎమ్మెల్యే హరీష్‌రావు బతుకమ్మపండగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కొండం కవిత సంపత్‌రెడ్డి, బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు కొండం సంపత్‌రెడ్డి, తడిసిన రమాదేవి, పురమాండ సుజాత, మంకాల నాగరాణి, జిడిగం ప్రసన్న, చిలివేణి ఉమా, కళాకారుని భవాని, అనిత, స్వప్న, సుజాత, రమా తదితరులు పాల్గొన్నారు.

## సిసిఐ కొనుగోలుకేంద్రాలు ప్రారంభించాలి

**-రవిందర్‌గౌడ్**

**హుస్నాబాద్ టౌన్, సెప్టెంబరు 20, ప్రభాతవార్త:**
నియోజకవర్గ వ్యాప్తంగా అక్టోబం్ మొదటివారంలోనే సిసిఐ పత్తి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని బిఎస్పి నియోజకవర్గ ఇంచార్జ్ పచ్చిమట్ల రవిందర్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. శనివారం పట్టణకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నియోజకవర్గవ్యాప్తంగా పత్తిసాగుచేసిన రైతులపంట త్వరలోనే చేతికివచ్చే అవకాశం ఉన్నదని, కావున రైతులు నష్టపోకుండా ఉండాలంటే కేంద్రప్రభుత్వం ద్వారా పత్తి కొనుగోలుచేసే సిసిఐకేంద్రాలను వచ్చేనెల మొదటివారంలోనే ప్రారంభించాలన్నారు. లేకుంటే పంటను రైతులు దళారులకు అమ్మి తీవ్రంగా నష్టపోయే అవకాశాలు ఉన్నాయన్నారు. సిసిఐ కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ఈప్రాంత ఎమ్మెల్యే, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపి, కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్‌లు చొరవ తీసుకోవాలన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు వేల్పుల శంకర్, వెంకటేష్, ఎలనగందుల శంకర్, దుండ్ర రాంబాబు, సుధాకర్‌తోపాటు తదితరులు ఉన్నారు.

## పాలిటెక్నిక్ విద్యార్థులకు సర్టిఫికెట్ల అందజేత

**జహీరాబాద్, సెప్టెంబరు 20, ప్రభాతవార్త:**
పట్టణ శివారులోని రంజోల్ గ్రామంలోని సంగమేశ్వర ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 224-25 విద్యాసంవత్సరంలో డిప్లొమా విద్యను పూర్తి చేసుకున్న విద్యార్థులకు శనివారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సువర్ణలత, మహేంద్రా అండ్ మహేంద్రా ఆటోమోటివ్ డివిజన్ సీనియర్ జనరల్ మేనేజర్ అండ్ ప్లాంట్ హెడ్ అనిల్‌కుమార్ మహేంద్రలు సర్టిఫికెట్లను అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన అనిల్‌కుమార్ మహేంద్రను విద్యార్థులు,పూర్వవిద్యార్థులు ఘనంగాసత్కరించారు. కార్యక్రమంలో కళాశాల విభాగాధిపతులు, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూమిని కాపాడండి

**చిన్నశంకరంపేట, సెప్టెంబరు 20, ప్రభాతవార్త:**
మండలపరిధి అంబాజీపేటలో ఉన్న ప్రభుత్వ భూమిని ఆక్రమించకుండా కాపాడాలని గ్రామస్థులు శనివారం తహసీల్దార్ మాలతికి వినతిపత్రం అందించారు. గ్రామ శివారులోని దుర్గామాత ఆలయాన్ని ఆనుకొని ప్రభుత్వ, గ్రామకంఠం భూమి ఉండగా, కొందరు రియల్టర్లు ఆ భూమిని ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తున్నట్లు వారు తెలిపారు. భూమి ఆక్రమణలకు గురికాకుండా రియల్టర్లపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను కోరారు.

# కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి జోరు

**-శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి**



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి

**నారాయణఖేడ్, సెప్టెంబరు 20, ప్రభాతవార్త:**
కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి జోరుగా సాగుతుందని ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి కొనియాడారు. నారాయణఖేడ్ మండల పరిధిలోని చల్లగిద్దతండాలో ఈరోజు నూతన అంగన్వాడీ భవనశంకుస్థాపన, డ్రైనేజీకాలువ, ప్రాథమిక పాఠశాల ప్రహరీగోడ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అనంతరం భవానీ అమ్మవారి దీక్షాధరుల స్వాములవారితో కలిసి భోగ్‌బండార్ కార్యక్రమంలో పాల్గొని భవానీ అమ్మవారి దర్శించుకున్నారు. **మీ గ్రామం అభివృద్ధి నా బాధ్యత..**

మీగ్రామం అభివృద్ధి నాబాధ్యత అని నారాయణఖేడ్ ఎమ్మెల్లే సంజీవరెడ్డి అన్నారు. శనివారం నూతన గ్రామపంచాయతీ భవనం, అంగన్వాడి భవన శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న గౌరవ నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి నారాయణఖేడ్ మండల పరిధిలోని హుక్రన(జి) గ్రామంలో శనివారం రూ.20లక్షల మంజూరైన నూతన గ్రామపంచాయతీ, రూ.12 లక్షల రూపాయలతో నూతన అంగన్‌వాడీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన పట్లోళ్ల సంజీవరెడ్డి మాట్లాడుతూ హుక్రన గ్రామం అంటేనే కాంగ్రెస్ పార్టీ అభిమాన గ్రామం అని ఈగ్రామానికి ఏం చేసినా కాంగ్రెస్‌పార్టీ చేసిందని ఎమ్మెల్యే అన్నారు. హుక్రాన గ్రామానికి మొత్తం 8 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయినాయని, అవసరమైతే ఇంకా ఇళ్లు పేదలకు ఇవ్వడానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వారితోపాటు రాణా ప్రతాప్, రమేష్‌చౌహాన్ బంజారా సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు, పండిత్‌నాయక్ సీని యర్ కాంగ్రెస్ నాయకులు, వి.గురునాథ్, సురేష్ చౌహాన్, రాజు, కిషన్, మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్, సంగన్న న్యాయవాది, పండరిరెడ్డి మాజీ ఎంపిటిసి, శ్రీకాంత్‌రెడ్డి, చల్లగిద్ద తండాప్రజలు, కాంగ్రెస్‌పార్టీ నాయకులు కార్యకర్తలు తాహెర్ అలీ మండల కాంగ్రెస్ అధ్యక్షులు, యూత్‌కాంగ్రెస్ నాయకులు డి.వెంకట్‌రామ్‌రెడ్డి, లక్ష్మరెడ్డి, బసిరెడ్డి, నాందేవ్‌రెడ్డి, రాఘవ్‌రెడ్డి, సంగరెడ్డి, సుభాష్, బి.నగేష్, రాములు, ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

## ఇంచార్జి ప్రత్యేక అధికారికి షోకాజ్ నోటీసులు

**నాగల్‌గిద్ద, సెప్టెంబరు 20, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని మోర్గి మోడల్ వసతిగృహం ఇంచార్జి ప్రత్యేక అధికారికి శనివారం జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు నోటీసులు జారీచేశారు. వసతిగృహంలోని విద్యార్థినులు పలుసమస్యలతో సతలమతమవుతున్నా తనకేం పట్టనట్లుగా వ్యవహరిస్తున్నట్లు అందిన ఫిర్యాదుల మేరకు శుక్రవారం నారాయణఖేడ్ సబ్‌కలెక్టర్ ఉమాహారతి మండల అధికారులతో కలిసి వసతిగృహాన్ని సందర్శించి విద్యార్థినులు పడుతున్న పాట్లను తెలుసుకుని నివేదికను జిల్లా అధికారులకు అందచేయగా స్పందించిన డిఈఓ వెంకటేశ్వర్లు ఇంచార్జి ప్రత్యేక అధికారికి నోటీసులు జారీచేశారు.

## కాంగ్రెస్ సర్కార్‌తోనే ముస్లిం మైనార్టీలకు న్యాయం

**-మైనార్టీ నాయకులు వహీద్‌ఖాన్**

**సిద్దిపేట రూరల్, సెప్టెంబరు 20, ప్రభాతవార్త:**
కాంగ్రెస్ సర్కార్‌తోనే రాష్ట్రంలో ముస్లిం మైనార్టీలకు న్యాయం జరుగుతుందని రాష్ట్ర కాంగ్రెస్‌పార్టీ మైనార్టీ నాయకులు వహీద్‌ఖాన్ అన్నారు. జిల్లా కేంద్రంలో ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. ప్రజాపాలనలో సిఎం రేవంత్‌రెడ్డి మైనార్టీ వర్గాల అభ్యున్నతి కోసం రెండు కొత్తపథకాలు ప్రవేశపెట్టడం హర్షణీయమన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చిన నాటినుంచి నేటివరకు అన్నివర్గాల సంక్షేమంకోసం సిఎం రేవంత్‌రెడ్డి కృతనిశ్చయంతో పని చేస్తున్నారని తెలిపారు. మైనార్టీవితంతువులకు ఇందిరమ్మ మైనార్టీ మహిళాయోజన ద్వారా రూ.50వేల సహాయం అందించడం అభినందనీయమన్నారు. అలాగే రేవంత్ అన్న కా సహారా ద్వారా మోపెడ్ వాహనాలకోసం రూ.లక్ష గ్రాంట్ మంజూరు చేయడం సంతోషంగా ఉందన్నారు. రెండు పథకాలకు అర్హులైన ప్రతి ఒక్కరూ అక్టోబర్ 6వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. మైనార్టీవర్గాల అభివృద్ధికోసం సిఎం రేవంత్‌రెడ్డి, మంత్రి అడ్లూరి లక్ష్మన్, అడ్వైజర్ షబ్బీర్ అలీ, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఉబెదుల్లాహ్ కొత్వాల్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

## హెవీ లైసెన్స్ కోసం ఉచితశిక్షణ

**-మోటర్ వెహికిల్ ఇన్స్‌పెక్టర్ యోగేశ్వర్‌సింగ్**

**హుస్నాబాద్ రూరల్, సెప్టెంబరు 20, ప్రభాతవార్త:**
ఇంటర్ నేషనల్ డ్రైవింగ్ సొసైటి సిరిసిల్ల వారి ఆధ్వర్యంలో లైట్ మోటర్ వెహికిల్ లైసెన్స్ కలిగి సంవత్సరం పూర్తి చేసుకున్న యువత హెవీ లైసెన్స్ పొందేందుకు ఉచితశిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు హుస్నాబాద్ మోటర్ వెహికిల్ ఇన్స్‌పెక్టర్ యోగేశ్వర్‌సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా విడుదలచేసిన ప్రకటనలో హుస్నాబాద్, పరిసరప్రాంత యువత హెవీ లైసెన్స్ శిక్షణ పొందేందుకు లైట్ మోటర్ వెహికిల్ లైసెన్స్ ఉండి సంవత్సరం పూర్తి అయి ఉండాలన్నారు. హెవీ లైసెన్స్ శిక్షణకు ఎంపికైన వారికి సిరిసిల్ల శిక్షణ కేంద్రంలో 30 రోజుల శిక్షణ ఇప్పించడం జరుగుతుందని, శిక్షణ కాలంలో వసతిగృహంతో పాటు ఉచితభోజన సౌకర్యం కల్పించనున్నట్లు వివరించారు. శిక్షణ పూర్తయిన తర్వాత ప్రయివేట్ కంపెనీలలో ఉద్యోగాలుసైతం ఇప్పించడం జరుగుతుందన్నారు. ఆసక్తిగల నిరుద్యోగ యువత సోమవారం ఉదయం వారి డ్రైవింగ్ లైసెన్స్‌తోపాటు ఆధార్‌కార్డు జిరాక్సులతో హుస్నాబాద్ కార్యాలయంలో సంప్రతించాలన్నారు.

## చేర్యాలలో అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటుచేయాలి

**-సిపిఐ ఆధ్వర్యంలో జిల్లా రెవెన్యూ అధికారికి వినతి**



వినతిపత్రం అందిస్తున్న సిపిఐ నాయకులు

**చేర్యాల, సెప్టెంబరు 20, ప్రభాతవార్త:**
చేర్యాలలో అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సిపిఐ కమిటీ ఆధ్వర్యంలో శనివారం జిల్లా రెవెన్యూ అధికారిణి నాగమణికి వినతి పత్రాన్ని అందించారు. ఈసందర్భంగా సిపిఐ కార్యవర్గ సభ్యులు అందే అశోక్ మాట్లాడుతూ ఏదైనా అనుకోకుండా ఆస్తి, పంట, ప్రాణనష్టం వంటి సంఘటనలు చోటుచేసుకున్నప్పుడు అందుబాటులో అగ్నిమాపక కేంద్రం లేదని జిల్లా నుండి సుమారు 40 కిలోమీటర్ల దూరం నుండే రావాలని వివరించినట్లు తెలిపారు. ఈప్రాంత ప్రజలకోరిక మేరకు సహకరించి అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటుచేయాలని కోరారు. ఈరి భూమయ్య, కత్తుల భాస్కర్‌రెడ్డి, నంగి కనకయ్య, రిక్కల మహిపాల్‌రెడ్డి, పోనుగోటి శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.

## కడవేర్గు పాఠశాలలో గ్రంథాలయం




గ్రంథాలయం ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

**చేర్యాల, సెప్టెంబరు 20, ప్రభాతవార్త:**
మండలంలోని కడవేర్గు ఉన్నత పాఠశాలలో చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ సంస్థ గ్రంథాలయం ఏర్పాటుచేయడంతో ఆపాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాజమణి శనివారం ప్రారంభించారు. ఈసందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాజమణి మాట్లాడుతూ రాష్ట్రంలో బాలలవికాసానికి బాలచెలిమి పేరుతో బాలలపత్రిక నిర్వహిస్తూ, గ్రంథాలయాలు నెలకొల్పుతున్న అకాడమీ చైర్మన్ బాలచెలిమి సంపాదకులు మణికొండ వేదకుమార్, కన్వీనర్ గరిపల్లి అశోక్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో ప్రారంభించిన 24పాఠశాలల్లో కడవేర్గు పాఠశాలకు ఈ అవకాశం దక్కడానికి కృషిచేసిన పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు గుళ్ళపల్లి తిరుమల కాంతికృష్ణను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేష్, చంద్రశేకర్‌రావు, కృష్ణమూర్తి, లింగాచారి, రామకృష్ణ, మమత, సాజిదా, అరుణ, ప్రీతి, సిఆర్‌పి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## వికలాంగుల సమస్యలు పరిష్కరించాలి




వినతిపత్రం అందిస్తున్న వికలాంగుల పోరాటసమితి

**చిన్నశంకరంపేట, సెప్టెంబరు 20, ప్రభాతవార్త:**
రాష్ట్రప్రభుత్వం వికలాంగుల సమస్యలను పరిష్కరించాలని వికలాంగుల పోరాటసమితి జిల్లా అధ్యక్షుడు బాచుపల్లి పాండు డిమాండ్ చేశారు. శనివారం మండలపరిధి ఖాజాపూర్ గ్రామంలో పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్‌కు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌పార్టీ వికలాంగులకు, వృద్ధులకు రూ.4వేల నుండి రూ.6వేలకు పెంపు, ఆసరా పెన్షన్‌ల పెంపు వంటి ఇచ్చిన హామీలను అమలుచేయాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో వికలాంగుల గ్రామ అధ్యక్షుడు బాలయ్య, రాజు, పోచాగౌడ్, నరేష్, మంగమ్మ, ఎల్లమ్మ, దేవమ్మ, సత్తమ్మ, నాయకులు బాలస్వామి పాల్గొన్నారు.